నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
8 | మహబూబ్‌నగర్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

శైలపుత్రీం.. యశస్వినీమ్

జోగుళాంబ ఆలయంలో శైలపుత్రీదేవికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- ఘనంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అలంపూర్/శ్రీశైలం, అక్టోబర్ 3 : ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. యాగశాల ప్రవేశం, మహా గణపతి, రుత్విక్వరణం, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మంటప ఆవాహనం, మహాకలశ స్థాపన, చండీ హోమాలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి నందీశ్వరుడి చిత్రపటంతో జెండావిష్కరణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. అనంతరం బలిహరణ చేశారు. ఈవో పురేందర్‌కుమార్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు జోగుళాంబ అమ్మవారు శైలపుత్రీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీశైల మహా క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. తొలిరోజు బ్రామరీ అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శైలపుత్రి రూపంలో అలంకరించి విశేష పూజలు చేశారు.

కుడిచేతిలో త్రిశూలాన్ని, ఎడమ చేతిలో పద్మాన్ని ధరించి శైలపుత్రి నామంతో పిలవబడుతున్న అమ్మవారిని పూజిస్తే విజయోత్సాహం కలుగుతుందని భక్తుల నమ్మకం.

శ్రీశైలంలో శైలపుత్రిగా దర్శనమిచ్చిన అమ్మవారు

ఉండవెల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తాలో గాలివానకు బీభత్సానికి జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల స్వాగత తోరణం నేలకొరిగింది. సబ్‌రోడ్డుపై పడడంతో 44వ జాతీయ రహదారి నుంచి చౌరస్తాలోకి వచ్చే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. *- ఉండవెల్లి, అక్టోబర్ 3*

వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి బంగారు ఆభరణాలను చూపెడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజలంతా సంతోషంగా ఉండాలి : శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, అక్టోబర్ 3 : జిల్లా కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ, బ్రహ్మణవాడలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం పూజలు చేశారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్ కిశోర్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

జోనల్ స్థాయి డ్యూటీ మీట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

నైపుణ్య పెంపునకు పోలీస్ డ్యూటీ మీట్

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 3 : మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో జోగుళాంబ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్-2024ను జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ గురువారం ప్రారంభించారు. కేసుల దర్యాప్తు, పరిశోధన, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం, ఫొటోగ్రఫీ వీడియోగ్రఫీ అంశాల్లో పోలీసులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో నైపుణ్యం ప్రదర్శించిన వారికి రివార్డులు అందించడంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పనితనాన్ని మెరుగుపరిచేందుకు, పెంపొందించేందుకు జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్, నగదు బహుమతులు, బహుళ ఇంక్రిమెంట్స్ ఇస్తామన్నారు. కేసుల దర్యాప్తులో, నేరాలు జరిగిన స్థలంలో, వస్తువులను సీజ్ చేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాంబు స్క్వాడ్, నార్కోటిక్ జాగిలాలను ఉపయోగించి ఏ విధంగా నేర పరిశోధన చేయాలనే అంశాలపై పరీక్షలు నిర్వహించారు.

కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ ఎస్పీ సురేశ్‌కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్, వనపర్తి అదనపు ఎస్పీ రామ్‌దాస్‌తేజ, నారాయణపేట ఏఆర్ అదనపు ఎస్పీ రియాజ్ ఉల్‌హక్, మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, డీటీసీ డీఎస్పీ నర్సింహులు, గద్వాల డీఎస్పీ నరేందర్‌రావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణితశాస్త్ర విభాగం అధ్యాపకుడు మధును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రకిరణ్

వినూత్న ఆవిష్కరణకు ప్రత్యేక గుర్తింపు

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, అక్టోబర్ 3 : ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అధ్యాపకుల వినూత్న ఆవిష్కరణకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా డిజైన్ సర్టిఫికెట్ లభించినట్లు పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తెలిపారు. గురువారం పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిమోట్ పరికరం విధానంలో పనిచేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను రూపొందించడంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యాపకులు విజయం సాధించారన్నారు. ఫైథాన్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి తయారు చేసిన ఈ పరికరంతో రోగికి గరిష్ఠ మోతాదులో ఆక్సిజన్ అందించవచ్చన్నారు. ఆక్సిజన్ స్థాయిలను నిరంతరం పర్యవేక్షించడం, హెచ్చుతగ్గులను సర్దుబాటు చేయడంతోపాటు రోగి వ్యక్తిగత అవసరాలను తీరుస్తుందన్నారు. మొబైల్ ద్వారా నియంత్రించేందుకు వీలుంటుందన్నారు. ఈ పరికరం తయారీలో మొత్తం ఆరు గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా, అందులో ముగ్గురు పాలమూరువాసులు కావడంతో పాలమూరు యూనివర్సిటీకి న్యాక్ గ్రేడింగ్‌తోపాటు భవిష్యత్తు సైంటిస్టులుగా అధ్యాపకులు గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలోని మ్యాథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.మధు, కొల్లాపూర్ పీజీ కాలేజ్ మ్యాథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.భారతి, జోగుళాంబ గద్వాల ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మ్యాథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.సత్తెమ్మ ఉన్నారని తెలిపారు. మిగిలిన వారిలో హైదరాబాద్ వాజ్జెన్ యూనివర్సిటీ ముంజం శంకర్‌రావు, భువనేశ్వర్ సీవీరామన్ గ్లోబల్ యూనివర్సిటీ లిపిక పాని గ్రాహి, మేడ్జల్ నల్లమల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎస్.అరుంధతి ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీయూ గణిత శాస్త్ర విభాగం అధ్యాపకుడు మధును ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, పీయూ పీఆర్వో శేకుంటి రవికుమార్, అధ్యాపకులు అభినందించారు.

సర్టిఫికెట్ అందుకున్న సత్తెమ్మ, భారతి, మధు

మక్క వర్షార్పణం

బాదేపల్లి మార్కెట్‌లో వర్షానికి తడిసిన మొక్కజొన్నను కుప్పగా వేస్తున్న డోజర్

బాదేపల్లి మార్కెట్‌లో రైతుల పాట్లు

బాదేపల్లిలో వర్షానికి కొట్టుకుపోయిన మక్క

అచ్చంపేటలో మక్కను ఏరుతున్న రైతులు

- జడ్చర్ల మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్న
- దాదాపు 3 వేల బస్తాలు నీటిపాలు
- కండ్ల ముందే కొట్టుకుపోయిన పంటతో కన్నీరుమున్నీరైన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

జడ్చర్ల, అక్టోబర్ 3 : ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ల ముందే వర్షార్పణం కావడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. జడ్చర్లలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆరుబయట ఉన్న మొక్కజొన్న పూర్తిగా తడిసోయింది. వర్షపునీటి ప్రవాహానికి మొక్కజొన్న కుప్పలు, ఆరబెట్టిన మొక్కజొన్న కొట్టుకుపోయింది. దీంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. మార్కెట్‌కు గురువారం 6,689 క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి వచ్చింది. టెండర్లు పూర్తయ్యాక వర్షం కురిసింది. దీంతో ఆరుబయట ఉన్న మొక్కజొన్న కుప్పలతో పాటు ఆరబెట్టిన మొక్కజొన్న వర్షపునీటిలో కొట్టుకుపోయింది.

రైతులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దాదాపుగా 3వేల బస్తాల మొక్కజొన్న తడిసిపోయి ఉంటుందని వ్యాపారవర్గాలు తెలిపాయి. మిడ్జిల్ మండలానికి చెందిన రైతు గోపాల్ రెండు ట్రాక్టర్లలో మొక్కజొన్న తీసుకొచ్చి ఆరబెట్టగా, వర్షానికి కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ఇందుకు రూ.60వేలకు పైగా ఖర్చయ్యింది. ధాన్యం అమ్ముకుందామని బాదేపల్లి మార్కెట్‌కు ట్రాక్టర్‌లో తీసుకొచ్చా. వర్షం కురవడంతో సగం కొట్టుకుపోయింది. అప్పు చేసి పంట పండిస్తే నీటిపాలైంది. సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థకావడం లేదు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

- గోపాల్, రైతు, వేముల, మిడ్జిల్ మండలం

తడిసినా కొనుగోలు చేయాలి

బాదేపల్లి మార్కెట్‌కు 6 ట్రాక్టర్లలో మొక్కజొన్న అమ్మకానికి తీసుకొచ్చాం. వర్షానికి మొత్తం తడిసిపోయింది. తడిసిన మొక్కజొన్నను వ్యాపారులు కొనుగోలు చేయరు. ప్రభుత్వం స్పందించి తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేసి ఆదుకోవాలి

- చాంది, మహిళా రైతు, ఇప్పలపల్లి చెన్నలగడ్డ తండా, తిమ్మాజిపేట మండలం

తేమశాతంతో కొర్రీలు

- అచ్చంపేట మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్న
- కొనుగోలుకు నిరాకరించిన ట్రేడర్లు

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 3 : మొక్కజొన్న ధాన్యాన్ని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే తేమ ఎక్కువ ఉందని కొనుగోలు చేయకపోవడంతో ఆరబెట్టుకోగా వర్షానికి నీటి పాలైందని రైతులు వాపోయారు. అచ్చంపేట మండలం లింగోటం గ్రామానికి చెందిన రైతు తగుళ్ల అంజి నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. మూడున్నర ట్రాక్టర్ల ధాన్యాన్ని అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం తీసుకురాగా, తేమ తక్కువగా ఉందని చెప్పారు. కనీసం షెడ్ల కింద ఆరబెట్టుకుందామని అధికారులను అడుగగా, వ్యాపారులు లీజుకు తీసుకున్నారని చెప్పడంతో చేసేది లేక ఆరుబయట సీసీ రోడ్లపై ఆరబెట్టారు. సాయంత్రం కురిసిన వర్షానికి మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. అలాగే లింగోటం గ్రామానికి చెందిన లింగయ్య సైతం మొక్కజొన్న ధాన్యాన్ని అమ్ముకునేందుకు రాగా, తేమశాతం పేరుతో కొనుగోలు చేయకపోవడంతో తడిసిపోయింది. ఒక్కసారిగా వాన రావడంతో మొక్కజొన్న తడిచిందని రైతులు వాపోయారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి నర్సింహులును వివరణ కోరగా, అధిక మొత్తంలో మొక్కజొన్న ధాన్యాన్ని రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారన్నారు. అకాలంగా వర్షానికి రువడంతో ధాన్యం తడిసిందన్నారు. అడిగిన రైతులందరికీ పడాలు అందించామని తెలిపారు.

అచ్చంపేట మార్కెట్‌లో వర్షానికి తడిసిన మక్కలను ఎత్తుతున్న రైతులు

అప్పులు చేసి.. అదృశ్యమై..

- ఉద్యోగాలు చేస్తూ వ్యాపారాలు
- పోలీసు శాఖలో బిల్డర్లు
- 30 కుటుంబాల నుంచి రూ.30 కోట్లకుపైగా వసూల్?

వనపర్తి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగాలు చేస్తూ సమాజంలో గౌరవం పొందాల్సిన కొందరు ప్రబుద్ధులు అత్యాశకు పోయి బోర్లాపడుతున్నారు. పోలీస్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న పలువురు రియల్ ఎస్టేట్, వైన్స్ తదితర వ్యాపారాల్లో మునిగి తేలారు. బ్యాంకుల్లో తప్పుడు మార్గంలో అప్పులు చేయడం నుంచి ప్రైవేట్ వ్యాపారులతోనూ కోట్ల రూపాయలు వడ్డీలకు తెచ్చి తమ నెత్తి మీదకు తెచ్చుకునే వరకు వెళ్లారు. చివరకు చేసిన పనుల బెంగతో ఓ కానిస్టేబుల్ వారం రోజుల కిందట లెటర్ రాసి అదృశ్యమవ్వగా, మరో కానిస్టేబుల్ హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల డ్యూటీకి వెళ్లి ఇంటికి రాలేదు. అటు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోకపోవడంతో ఖాకీలు తెరవెనక చేసిన తతంగమంతా గుప్పుమంటుంది. వనపర్తి జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు చేస్తున్న కొందరు ఆ శాఖ గౌరవం మంటగలిపేలా చేశారు. రియల్ ఎస్టేట్, వైన్స్ వ్యాపారాలకు ఆకర్షితులై చివరకు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవడంతో పలు కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చింది. జిల్లా పరిధిలోని శ్రీరంగాపురంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రదారిగా నిలుస్తున్నారు. అయితే, ఇటీవల పాన్‌గల్ మండల కేంద్రంలో పనిచేస్తున్న రామకృష్ణ అనే కానిస్టేబుల్ తాను ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయానని, కుటుంబానికి న్యాయం చేయలేనంటూ ఆవేదనతో మెసేజ్ చేసి కనిపించకుండా పోయాడు. అతని భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మరో కానిస్టేబుల్ హైదరాబాద్‌లో రెండు రోజుల వినాయక నిమజ్జనం డ్యూటీకి వెళ్లి ఇంటికి రాకపోగా, స్టేషన్‌కు వెళ్లకపోవడంతో పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించింది.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

చేసిన వ్యాపారాలివే..

ప్రభుత్వ ఉద్యోగాలున్నా.. పలువురు ప్రైవేట్ వ్యాపారాల ముసుగులో అనేక దందాలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా రియల్ ఎస్టేట్‌ను నడిపించడం, విల్లాల నిర్మాణం, ఇండ్ల పేరుతో బ్యాంకుల రుణాలు, ఒకే ఇంటి పేరుతో రెండు, మూడు రుణాలు, దస్త్రాల పోర్జరీలు, పోలీసు శాఖలో అందించే భద్రతా పథకం ద్వారా సొంత శాఖలోనే పలువురు కానిస్టేబుళ్ల పేరుతో రుణాలు తీసుకోవడం, ఒకరికి అమ్మి మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడంలాంటి వాటితో వ్యాపారం బెడిసికొట్టింది. స్థానికంగా ఎస్‌బీఐ, కరూర్ వైశ్య బ్యాంక్, ఎస్‌జీబీ తదితర శాఖల్లో ఇండ్ల పేరుతో, భద్రతా పథకం పేరుతో రుణాల వ్యవహారం అడ్డగోలుగా సాగినట్లు గుసగుసలున్నాయి.

రూ.30 కోట్లకు పైగా..

పోలీసు కొలువుల్లో ఉంటూ వ్యాపారాలకు తెరతీసిన కానిస్టేబుల్ చర్యల వల్ల పట్టణంలో దాదాపు 30 నుంచి రూ.40కోట్లకు పైగా గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో 30కు టుంబాలకు పైగా ఈ వ్యవహారంలో తలదూర్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తున్నది. వీటిలో కొందరు పోలీసులు నెలవారి రుణాల కంతులు కట్టలేక, ఇండ్లకు డబ్బులిచ్చినా అవి స్వాధీనం లేక ఇంకొందరు, డబుల్ రిజిస్ట్రేషన్లు, డబుల్ రుణాలతో ఇలా బాధితులు లబోది బోమంటున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, ఐదేండ్లుగా నడుస్తున్న ఈ వ్యాపార దందాలో చిక్కుకున్న కుటుంబాలన్నీ ఆర్థిక చిక్కుల్లో పడటంతో జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది.

రంగంలోకి పోలీసులు..

సమాజానికి రక్షణగా ఉండాల్సిన కొందరు ఉద్యోగులు చేసిన పనుల అపవాదు ఆశాఖ కూడా మోయాల్సి వస్తుంది. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ వ్యవహారంపై పోలీసు శాఖ దృష్టి పెట్టింది. పది రోజులకు పైగా సెలవులో ఉన్న ఎస్పీ ఇటీవలే విధుల్లో చేరారు. దీంతో సొంత శాఖ ఉద్యోగులు చేసిన ఈ వ్యవహారాన్ని కొలిక్కి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. బాధిత కుటుంబాల సమాచారం తెలుసుకోవడం, జరిగిన సంఘటనలను పూర్తిగా విశ్లేషించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఇద్దరు కానిస్టేబుళ్లను సైతం సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలను షురూ చేయడంతో జిల్లా పోలీసు శాఖ ఉలిక్కి పడింది.

బాధితులు ఫిర్యాదు చేయొచ్చు..

జిల్లా కేంద్రంలో రాకేశ్ అనే కానిస్టేబుల్ చేసిన వ్యాపారాలకు సంబంధించి బాధితులుంటే ఫిర్యాదు చేయొచ్చు. లోతుగా అన్ని విషయాలను పరిశీలిస్తాం. ఇందులో బయటకు వచ్చిన విషయాలను పరిశీలించాలంటే కాస్త సమయం పడుతుంది. ఎవరైనా చట్టానికి లోబడి పని చేయాలి. అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు.

- రావుల గిరిధర్, ఎస్పీ, వనపర్తి

తప్పిపోయిన వ్యక్తి కోసం గాలింపు

లింగాల, అక్టోబర్ 3 : మండలంలోని ఎర్రపెంటకు చెందిన నిమ్మల శంకర్ కోసం అటవీ, పోలీస్‌శాఖ అధికారులు గురువారం చెంచుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 28వ తేదీన నిమ్మల కృష్ణ, నిమ్మల లక్ష్మమ్మ అటవీ ఉత్పత్తులను సేకరించడానికి అడవికి వెళ్లారు. చీకటి పడడంతో ఇద్దరూ అడవిలోనే నిద్రించారు. తెల్లవారు జామున నిద్రలేచి చూసేసరికి నిమ్మల శంకర్ కనిపించలేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అతడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు, అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

సీబీఐ పేరుతో బెదిరింపులు

వంగూరు, అక్టోబర్ 3 : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దివ్యాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలీశ్వర్‌ను బుధవారం సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి బెదిరించారు. తాము సీబీఐ అధికారులమని, ఢిల్లీలో ఇంటర్ చదువుతున్న మీ కుమారుడు అమ్మాయిలను వేధించడంతో అరెస్టు చేశామని తెలిపారు. మీ కుమారుడిపై కేసు కాకూడదంటే డబ్బులు ఇవ్వాలని పలుమార్లు ఫోన్ చేసి బెదిరించారు. వారు ఫోన్ చేసే సమయంలో బాలీశ్వర్ కుమారుడు గ్రామంలో తన దగ్గరే ఉండడంతో డయల్ 100కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

- దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన

వనపర్తి టౌన్, అక్టోబర్ 3 : జిల్లా కేంద్రంలోని ప్రసూతి దవాఖానలో వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీపనగండ్ల మండలం సంగినేనిపల్లికి చెందిన అనూష ప్రసవం కోసం మూడు రోజుల కిందట దవాఖానలో చేరినట్లు బంధువులు చెప్పారు. సాధారణ కాన్పు కోసం దవాఖాన సిబ్బంది 10 నెలలు పూర్తయ్యి మూడు రోజులు అవుతున్నా ప్రసవం చేయలేదని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి చనిపోయిందని ఆరోపించారు. ఘటనా స్థలానికి రూరల్ పోలీసులు చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆందోళన విరమింపజేశారు.